సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 2 । మే । 2024




పాయకరావుపేటలో బహిరంగ సభకు విచ్చేసిన అశేష జనవాహిని, జై జగన్ అంటూ నినదిస్తున్న మహిళలు



ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వన్స్ మోర్.. సీఎం సార్

- పాయకరావుపేటలో ఉప్పొంగిన అభిమాన సంద్రం
- సూర్యమహల్ జంక్షన్‌లో సీఎం వైఎస్ జగన్ సభకు పోటెత్తిన జనం
- మండుటెండలోనూ వెల్లువెత్తిన అభిమానం
- 59 నెలల్లో చేసిన మేలును వివరించిన ముఖ్యమంత్రి
- చంద్రబాబు మోసాలపై నిప్పులు
- చంద్రబాబు చేస్తున్న కుట్రలు, బూటకపు వాగ్దానాలపై చెణుకులు
- వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించడానికి మేమంతా సిద్ధం అంటూ ప్రజల హర్షధ్వానాలు

ఐదేళ్ల కిందట ఓ ఆప్తుడు ఇంటి తలుపుతట్టాడు...ఎన్నో వెలకట్టలేని పథకాల కానుకలు, అభివృద్ధి బహుమతులు అందజేశాడు... యోగక్షేమాలు చూశాడు... రోగముంటే చేతి చమురు వదలకుండానే బాగుచేయించాడు.. ఉండేందుకు గూడు ఇచ్చాడు...పిల్లలకు కార్పొరేట్ స్థాయి చదువులు చెప్పించాడు.. అక్కచెల్లెమ్మలకు అడిగిన, అడగని కానుకలిచ్చాడు... అవ్వాతాతలకు మనుమడిగా మారాడు... పిల్లలకు మేనమామగా మేలు చేశాడు... ఆయన శాశ్వతంగా ఇక్కడే ఉంటే ఎంత బాగుండు... మా కష్టాలు, బాధలు మటుమాయమవుతాయి... ఈ ఆలోచనలు వారిని ఉక్కిరిబిక్కిరి చేశాయి.. ఎలాగైనా ఆయనే మళ్లీ రావాలని అందరూ కోరుకున్నారు...ఆ కోరిక గుండెలను దాటి గొంతుల్లోంచి ప్రతిధ్వనించింది... మా నమ్మకం నువ్వే జగన్ అంటూ నినదించింది. తమను పలకరించేందుకు మండుటెండలో వచ్చిన మనసున్న నేతను చూసి పేట పులకించిపోయింది.. అభివృద్ధి సారథి రాకతో ఆనందపరవశంలో ఓలలాడింది... నవరత్నాల ప్రదాతకు నమోవాకాలు పలికింది... నిప్పులు చెరిగిన సూర్యుడిని సైతం లెక్కచేయక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సభకు భారీగా తరలివచ్చారు స్టార్ క్యాంపెయినర్లు. దీంతో పాయకరావుపేట జనసంద్రంగా మారింది.

సాక్షి, అనకాపల్లి: పాయకరావుపేటను జన సునామీ ముంచెత్తింది. బుధవారం జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు ప్రజలు పోటెత్తారు. సూర్యమహల్ జంక్షన్‌లో అభిమాన జన తరంగం ఉప్పొంగింది. మిట్ట మధ్యాహ్నం.. భగభగమంటూ నిప్పులు చెరుగుతున్న సూర్యు డు... 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత.. అయినా లెక్క చేయకుండా తమ అభిమాన నేతను చూసేందుకు పాయకరావుపేట, యలమంచిలి, తుని నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వేలా దిగా తరలివచ్చారు. వారి కేరింతలు.. కరతాల ధ్వనులు, నినాదాలతో సభప్రాంగణం హోరెత్తింది. పాయకరావుపేట సూర్యమహల్ జంక్షన్ నుంచి జాతీయరహదారిపై వై జంక్షన్ వరకూ రహదారులు కిక్కిరిశాయి.

సీఎం పర్యటన సాగింది ఇలా..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయనగరం జిల్లా బొబ్బిలిలో సభ ముగించుకుని మధ్యాహ్నం 2 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి పాయకరావుపేటలో మంగవరం రోడ్డు సమీపంలో గల హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన 2.13 గంటలకు పాయకరావుపేట సూర్య మహల్ జంక్షన్ వద్ద సభాస్థలికి చేరుకున్నారు. మధ్యాహ్నం 2.20 గంటల నుంచి 2.53 గంటల వరకూ బహిరంగ సభ జరిగింది. ప్రసంగం తరువాత సీఎం అక్కడ నుంచి 3.05 గంటలకు బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి 3.15 గంటలకు హెలికాప్టర్‌లో ఏలూరు బయలుదేరారు.

మళ్లీ మళ్లీ మీరే సీఎం కావాలి

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం ఆద్యంతం ప్రజలను ఉర్రూతలూగించింది. అరగంట పాటు సాగిన ప్రసంగానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ఒకవైపు చంద్రబాబు చేస్తున్న కుట్రలు, బూటకపు వాగ్దానాలను చీల్చి చెండాడుతూనే.. మరోవైపు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు గుర్తు చేశారు. చంద్రబాబు కుయుక్తులు చిత్తు చేసేందుకు, ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు 'మేము సైతం సిద్ధం' అంటూ జనం నినదించారు. సీఎం ప్రసంగిస్తున్నంత సేపు అభిమానులు ఉత్సాహంగా కనిపించారు. సీఎం జగన్ ప్రసంగిస్తు న్న సమయంలో వన్స్ మోర్ సీఎం సార్ అన్న నినాదాలతో సభాప్రాంగణం మార్మోగిపోయింది. అన్నా.. నిన్ను సీఎంగా చేసుకునేందుకు మేమంతా సిద్ధం అంటూ ప్లకార్డులతో హోరెత్తించారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టో పేపర్‌ను చూపిస్తూ .. బాబు చేసిన మోసాలను సీఎం జగన్ వివరిస్తుంటే.. చంద్రబాబు వద్దు.. జగనన్నే ముద్దు అంటూ జనం నినాదాలు చేశారు. ఎన్నికలకు సిద్ధమా..? అని సీఎం జగన్ అన్న వెంటనే... మేమంతా సిద్ధమని సభలో ఉన్న వారంతా ఉత్సాహంగా బదులిచ్చారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను పరిచయం చేసిన సీఎం

'మన పార్లమెంట్ అభ్యర్థిగా మీలో ఒక్కడైన మీ లోకల్‌ని...ముత్యాలనాయుడిని నిలబెడుతున్నాను. మీ చల్లని ఆశీస్సులు..దీవెనలతో ఆశీర్వదించండి' అని సీఎం కోరారు. పాయకరావుపేట నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న కంబాల జోగులు సౌమ్యుడు, మంచివాడు అన్నకు మీ ఆశీస్సులుండాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీ సం రామకృష్ణ, ఎంఎస్ఎంఈ చైర్మన్ సూర్యనారాయణరాజు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొండా రాజీ వ్‌గాంధీ, మత్స్యకార నాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

చేపల వల బహూకరణ

సీఎం జగన్‌కు మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీనివాస్ చేపల వల, టోపీ బహూకరించారు. టోపీని జగనన్న తలపై ఉంచి మత్స్యకారులు మురిసిపోయారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వేటనిషేధ కాలంలోనే రూ.10 వేల మత్స్యకార భరోసా ఇచ్చి తమ ఇళ్లలో ఆకలి కేకలు లేకుండా చేశారని కృతజ్ఞతలు తెలిపారు.




జనవాహినిని ఉద్దేశించి మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వేదికపై పాయకరావుపేట అసెంబ్లీ అభ్యర్థి కంబాల జోగులు, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడు



వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహం

ఈ ఎన్నికలు పేదోడి భవిష్యత్తును నిర్ణయిస్తాయి



ఈ ఎన్నికలు ప్రతి పేదోడి భవిష్యత్తును నిర్ణయిస్తాయి. వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తే పేదోడికి మంచి జరుగుతుంది. అదే టీడీపీకి ఓటు వేస్తే పెత్తందార్లకు మేలు జరుగుతుంది. స్థానికుడినైన నేను అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేస్తున్నాను. నేను పక్కా లోకల్..ప్రజలకు ఏ సమస్య వచ్చినా స్థానికంగా అందుబాటులో ఉంటాను. బీజేపీ నుంచి బ్యాంక్‌లను మోసం చేసిన డబ్బులతో సి.ఎం.రమేష్ నాపై పోటీ చేస్తున్నాడు. పేదోడికి..పెత్తందారులకు మధ్య జరిగే పోటీ ఇది. ఎంపీగా నన్ను, పాయకరావుపేట ఎమ్మెల్యేగా కంబాల జోగులును గెలిపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

– బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి

ప్రచార హోరు



చింతపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న పాడేరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వేశ్వరరాజు

- దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు
- వెనుకంజలో బీజేపీ, టీడీపీ అభ్యర్థులు
- జోరు పెంచిన అరకు అసెంబ్లీ టీడీపీ రెబల్ అభ్యర్థి సివేరి అబ్రహం

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో అభ్యర్థుల ప్రచారం హోరెత్తుతోంది. అరకు పార్లమెంట్‌కు 13 మంది, అరకు అసెంబ్లీకి 17, పాడేరు అసెంబ్లీకి 16, రంపచోడవరం అసెంబ్లీకి 12 మంది బరిలో ఉన్నారు.వైఎస్సార్‌సీపీ తరఫున అరకు పార్లమెంట్‌కు గుమ్మా తనూజారాణి, అరకు అసెంబ్లీకి రేగం మత్స్యలింగం, పాడేరు అసెంబ్లీకి మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రంపచోడవరం అసెంబ్లీకి నాగులపల్లి ధనలక్ష్మి బరిలో ఉన్నారు. వీరంతా ఇప్పటికే నియోజకవరాల్లో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నేరుగా ఓటర్లను కలుస్తూ వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను వారికి వివరిస్తూ మద్దతు కోరుతున్నారు. వీరితోపాటు పార్టీ క్యాడర్ కూడా గ్రామాల్లో ప్రచారం ముమ్మరం చేసింది. టీడీపీ, బీజేపీ అభ్యర్థులు కూడా ప్రచారంలో నిమగ్నమయ్యారు.



కాశీపట్నంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ రెబల్, స్వతంత్ర అభ్యర్థి సివేరి అబ్రహం



కుల్లుబలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం



ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి తనూజారాణి, రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థి, ధనలక్ష్మి

వణుకు పుట్టిస్తున్న అబ్రహం

అరకు అసెంబ్లీకి టీడీపీ రెబల్‌గా బరిలో నిలిచిన అభ్యర్థి సివేరి అబ్రహం బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావుకు వణుకు పుట్టిస్తున్నారు. అరకు టికెట్ కేటాయింపు విషయంలో తనకు చంద్రబాబు చేసిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తూ టీడీపీ శ్రేణులను తనకు మద్దతుగా అబ్రహం కూడగట్టుకుంటున్నారు. స్వతంత్ర అభ్యర్థులు ప్రచారం మొదలుపెట్టారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ :కలెక్టర్

సాక్షి,పాడేరు: సామాజిక భద్రత పథకంలో పింఛన్ల పంపిణీ చురుగ్గా జరుగుతోందని కలెక్టర్ ఎం.విజయసునీత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 8 గంటలకు డీబీటీ కింద చెల్లింపుల్లో రాష్ట్రంలో జిల్లా మూడవ స్థానం, ఇంటింటికి వెళ్లి చెల్లింపుల్లో 11వస్థానంలో ఉందన్నారు. మొత్తం అన్ని పింఛన్ల పంపిణీకి సంబంధించి ఆరవ స్థానం సాధించామన్నారు. బుధవారం బ్యాంకులు సెలవులు అయినప్పటికీ జిల్లాలోని 52 బ్యాంకుల్లో కరస్పాండెంట్లను ఏర్పాటు చేసి వారి ద్వారా వారి ద్వారా వేగవతం చేశామన్నారు.అలాగే బ్యాంకులకు వెళ్లే పింఛనుదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా షామియానాలు, కుర్చీలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆయా కేంద్రాల వద్ద అత్యవసర మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు ఏర్పాటుచేశామన్నారు. రెండు రోజులలో పింఛన్ల పంపిణీని పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నామని ఆమె పేర్కొన్నారు.



ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ సునీత

ప్రత్యేక భద్రత మధ్య..

సాక్షి,పాడేరు: అరకులోయ అసెంబ్లీకి 17మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున రెండో బ్యాలెట్ యూనిట్లను ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తెచ్చింది. పాడేరులోని ఈవీఎం వేర్ హౌస్ నుంచి 398 ఈవీఎంలను కలెక్టర్ విజయసునీత, పలు రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ర్యాండమైజేషన్ చేపట్టారు. అనంతరం వాటిని ప్రత్యేక భద్రత మధ్య కంటైనర్‌లో అరకులోయ తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.

క్లుప్తంగా

మెకానిక్ హత్య కేసు నిందితుడికి రిమాండ్



హత్య కేసు నిందితుడిని అదుపులో తీసుకున్న సీఐ రమేష్, పోలీసులు

పెదబయలు: పెదబయలు గ్రామంలోని తైసాబు ఈశ్వరరావు ఇంటి డాబాపై గత నెల 27న పాడేరు మండలం నక్కలపుట్టు పంచాయతీ వంతాడపల్లి గ్రామానికి చెందిన సోభ హేమరాజు(33) అనే బైక్ మెకానిక్‌ను హత్య చేసిన నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పెదబయలు మండలం సీతగుంట పంచాయతీ ముసిడిపుట్టు గ్రామానికి చెందిన పల్లుల సుందరరావు భార్యకు, మృతుడు హేమరాజుకు వివాహేతర సంబంధం ఉంది. ఆ అనుమానంతో హత్య చేసినట్టు పోలీసు విచారణలో నిందితుడు సుందరరావు అంగీకరించాడు. ఐదు రోజులుగా పరారీలో ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించగా.. రిమాండ్ విధించినట్టు జి.మాడుగుల సీఐ రమేష్ తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

అరకులోయ టౌన్: ఎస్‌ఈబీ పోలీస్‌స్టేషన్ పరిధిలో డుంబ్రిగుడ మండలంలో జైపూర్ జంక్షన్ వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో వాహనంలో తరలిస్తున్న 16 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఈబీ సీఐ నాగమణి చెప్పారు. డుంబ్రిగుడ మండలం కించమండ గ్రామానికి చెందిన గుజ్జలి రత్నాలమ్మకు అదుపులోనికి తీసుకుని, కోర్టులో హాజరు పర్చగా, రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

35 లీటర్ల సారా స్వాధీనం

హుకుంపేట: సారా తయారీ, విక్రయాలు చెప్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సతీష్ తెలిపారు. మండలంలోని గత్తుం గ్రామంలో సారా విక్రయిస్తున్నట్టు పోలీసులకు అందిన సమాచారం మేరకు గురువారం గ్రామంలో దాడులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో పాంగి రాంబాబు అనే వ్యక్తి సారా విక్రయిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు.

జగనన్నతోనే గిరిజనాభివృద్ధి



కందులగాది గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పక్కన చెట్టి వినయ్



చింతపల్లిలో ర్యాలీకి తరలివచ్చిన జనం

- పాడేరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు
- చింతపల్లిలో ఎన్నికల ప్రచారం
- భారీగా తరలిరావడంతో కిక్కిరిసిన రోడ్లు

చింతపల్లి రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే గిరిజనాభివృద్ధి సాధ్యమని పాడేరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్‌తో కలిసి ఎన్నికల ప్రచార ర్యాలీ మండల కేంద్రం చింతపల్లిలో హనుమాన్ జంక్షన్ నుంచి డిగ్రీ కళాశాల వరకు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భారీగా తరలిరావడంతో జనసంద్రాన్ని తలపించింది. రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. జయహో జగనన్న నినాదాలతో వారంతా హోరెత్తించారు. తీన్‌మార్ డప్పులు, థింసా నృత్యాలతో కార్యకర్తలు హోరెత్తించారు. ముందుగా మండలంలో కందులగాది గ్రామంలో వారు ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ జగనన్న ఒక్కడే మన గిరిజనుల కష్టాలను తీర్చగలరన్నారు. రాజకీయ పార్టీలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి పాడేరు అసెంబ్లీ అభ్యర్థిగా తనను, అరకు ఎంపీ అభ్యర్థిగా గుమ్మ తనూజారాణిని గెలిపించాలని కోరారు. ప్రతిపక్షాలు మోసపూరిత హామీలతో వస్తున్నాయని, వారిని ఏ ఒక్కరు నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్, ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు దురియా పుష్పలత, మండల పార్టీ అధ్యక్షులు మోరిరవి, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, వైస్ ఎంపీపీలు శారద, వెంగళరావు, కోఆప్షన్ నాజర్‌వలీ, ఎంపీటీసీలు ధారలక్ష్మి, జయలక్ష్మి, మీనాకుమారి, ట్రైకార్ డైరెక్టర్ లోవరాజు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, జిల్లా పార్టీ యువజన విభాగ కమిటీ కార్యదర్శి మత్స్యరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జల్లి హలియారాణి తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు



దేవీపట్నంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

దేవీపట్నం: పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందని రంపచోడవరం సిట్టింగ్ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని సరభవరం పంచాయతీలో ఉప్పయ్యపాలెం, కంబలంపాలెం, పూడిపల్లి పంచాయతీల్లో గొందురు, గండికోట, నెలకోట పునరావాస కాలనీల్లో, తున్నూరు పంచాయతీలో కచులూరు, గొందురు, ఇందుకురు పంచాయితీలో పెదరమనయ్యపేట గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా జగనన్న పాలనలోని ఐదేళ్ల కాలంలో ఎన్నడూ లేనంతగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి జరిగిందన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ప్రజారంజకమని, అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉందన్నారు. మేనిఫెస్టో , సంక్షేమ పథకాలు కరపత్రాలను పంపిణీ చేశారు. మరోసారి జగనన్న ముఖ్యమంత్రి కావాలంటే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండో ఓట్లు వేసి రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, అరకు ఎంపీ అభ్యర్థిగా తనూజారాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామస్తులు ఆమెను ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ కుంజం మురళి, జెడ్పీటీసీ సభ్యురాలు సిరసం సత్యవేణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయుధ దళాల మోహరింపు



వై.రామవరంలో సాయుధ బలగాల పహారా

వై.రామవరం: అల్లూరి సీతారామరాజు జిల్లా సరిహద్దు ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్, మరో పక్క సమీపిస్తున్న సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమమైంది. ఈ సందర్భంగా మండల సరిహద్దు అటవీ ప్రాంతంలో(ఏఓబీ) పోలీసు బలగాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఏఓబీలో మావోయిస్టులు ప్రవేశించవచ్చునన్న అనుమానంతో నలుమూలల నుంచి వివిధ పోలీసు సాయుధ దళాలు వచ్చినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో వై.రామవరం మండలం మీదుగా భారీ ఎత్తున పోలీసు బలగాలు సరిహద్దు అటవీ ప్రాంతంలోకి ప్రవేశించాయి. అలాగే జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏజెన్సీ అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలోని ప్రధాన రహదారులలోను, అనుమానస్పద ప్రదేశాల్లోను ఆయా పోలీసు స్టేషన్ల సిబ్బంది విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి

- లొంగిపోయిన వారికి పునరావాసం
- చింతపల్లి ఏఎస్పీ ప్రశాంత్ శివకిషోర్



గిరిజనులతో మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రశాంత్ శివకిషోర్

కొయ్యూరు: మావోయిస్టులు విధ్వంసాలకు స్వస్తి పలికి జనజీవన స్రవంతిలో కలవాలని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ కోరారు. మంప పోలీసుస్టేషన్ పరిధి బూదరాళ్ల పంచాయతీ కన్నవరంలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో వైద్యశిబిరం, వాలీబాల్ టోర్నమెంట్‌ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. ఉద్యమాల వల్ల జరిగే మేలు ఏమీ లేదన్నారు.ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను దృష్టిలో ఉంచుకుని జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు. మావోయిస్టుల మూలంగానే అభివృద్ధి వెనుకబడిందన్నారు. చాలావరకు వారి కదలికలు తగ్గాయన్నారు. అలాంటి వారు ఎవరు వచ్చినా వ్యతిరేకించాలని కోరారు. మావోయిస్టులు కిరణ్, డుంబు, సాయి కిరణ్ తదితరులు స్వచ్ఛందంగా లొంగిపోవాలని కోరారు. వారికి పోలీసుశాఖ ద్వారా పునరావాసం కల్పిస్తామన్నారు.

కీలక నేత జలంధర్‌రెడ్డి అలియస్ కృష్ణ లాంటి కీలక నేతలు లొంగిపోయి ప్రశాంత జీవితం గడుపుతున్నారన్నారు. ఈ పదేళ్లలో మావోయిస్టుల చేతిలో 38 మంది గిరిజనులు ప్రాణాలు కోల్పోయారన్నారు. పోలీసులకు ఇన్‌ఫార్మర్లు లేకపోయినా అనుమానంతో వారిని చంపేశారని చెప్పారు. గిరిజన యువత పట్టుదలతో చదివి, ప్రభుత్వం అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాల్లో ఉండాలన్నారు. గ్రామాలకు రహదారులు, మొబైల్ సౌకర్యం వస్తున్నాయన్నారు. వాలీబాల్ టోర్నమెంట్‌లో 32 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటుచేశారు. వైద్య శిబిరానికి రోగులు భారీగా వచ్చారు.రాజేంద్రపాలెం వైద్యులు మనోజ్ఞ, కొయ్యూరు సీఐ వెంకటరమణ, జీకే వీధి సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐలు లోకేష్‌కుమార్, రామకృష్ణ, అదనపు ఎస్ఐ దేముడు, జీకే వీధి ఎస్ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే అందరి లక్ష్యం



అరడకోటలో ఎన్నికల ప్రచారంలో భాగంగా సంక్షేమ పథకాలు, మేనిఫెస్టోను వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, పార్టీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి

పెదబయలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే గిరిజనుల అభ్యున్నతి సాధ్యమైందని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకొని మరింత అభివృద్ధి, సంక్షేమం సాధించుకుందామని వైఎస్సార్‌సీపీ అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని అరడకోట పంచాయతీ చెరువువీధి, అరడకోట, బొంగదారి, వనభంగి పంచాయతీ దిగువ పేడాపల్లి, వనభంగి, ఉక్కుర్బ, గడ్డిబంద. కవెలబంద, గలగండ పంచాయతీ సిరళపల్లి, ఈదులపుట్టు, మంగబంధ, గలగండ, గసాబు, గంపరాయి పంచాయతీ చీడిపుట్టు, గంపరాయి, కాగుల, కుల్లుభ గ్రామాల్లో వారు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి జరగని అభివృద్ధి జగనన్న పాలనలో ఈ ఐదేళ్లలో అనూహ్య పురోగతి జరిగిందను. వైఎస్సార్‌సీపీ విజయమే అందరి లక్ష్యమన్నారు. వనభంగి, అరడకోట, గలగండ, కిముడుపల్లి పంచాయతీలకు అనుసందానం చేస్తే నాలుగు తారురోడ్డు నిర్మాణం జగన్ పాలనలో జరిగిందన్నారు. గ్రామ సచివాలయ, గ్రామ వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజల గడప వద్దకే చేరువయ్యాయన్నారు. పేదలకు అందుతున్న ప్రభుత్వ పథకాలను అందకుండా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అడ్డుపడుతున్నారని, ఇందులో భాగంగానే పింఛన్లను వలంటీర్లు అందించకుండా ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదులు చేశారని, దీంతో గత నెలలో అవ్వా తాతలు పింఛన్ల కోసం చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. సుమారు 30 మంది మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు వంతాల ఆనందరావు, ఎంపీపీ బొండా వరహాలమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు, నాయకులు గంగాభవానీ, సూర్యనారాయణ,, నాయకులు సింహాచలం, సూరయ్య, ధనరాజ్, భీముడు. కనకరాజు, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్ పక్రియ పూర్తి



కలెక్టర్ విజయసునీత వీడియో కాన్ఫరెన్సులో రంపచోడవరం ఆర్వో ప్రశాంత్‌కుమార్



స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను పరిశీలిస్తున్న రంపచోడవరం ఆర్వో ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ర్యాండమైజేషన్ వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధుల సమక్షంలో నిర్వహించినట్టు రంపచోడవరం అసెంబ్లీ రిటర్నింగ్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. రంపచోడవరం అసెంబ్లీ, అరకు పార్లమెంట్‌కు సంబంధించి బుధవారం స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఈవీఎంలు, వీవీ ప్యాట్ల స్ట్రాంగ్ రూమ్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వతంత్ర అభ్యర్థుల సమక్షంలో తెరిచినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియను పాడేరు నుంచి సాధారణ ఎన్నికల పరిశీలకులు కె. వివేక్ నందన్, జిల్లా ఎన్నికల అధికారి యం. విజయ సునీత వీడియో కాన్ఫరెన్సు ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆర్వో ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీకి మొత్తం 12 మంది అభ్యర్థులు బరిలో ఉన్నాయన్నారు. ర్యాండమైజేషన్‌పై ఎవరికైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే నివృత్తి చేస్తామన్నారు. అనుమానాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రిటర్నింగ్ అధికారి వివిధ పార్టీలకు సంబంధించిన ప్రతినిధులను తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని ఆయన కోరారు. అసిస్టెంట్ ఆర్వో ఎ.కృష్ణ జ్యోతి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె. దేవేంద్రుడు, వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలు, డిప్యూటీ తహసీల్దార్లు బి. రాజు, రామకృష్ణ, సుబ్బారావు, శివ, శ్రీధర్, బాలాజీ, చైతన్య, విశ్వనాథ్, రవీంద్రబాబు, సత్యనారాయణ, సరిత, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐమోహన్‌రావు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న ఆర్వో అభిషేక్

అరకులోయ రూరల్: అరకు అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవీఎంలు ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని రిటర్నింగ్ అధికారి వి.అభిషేక్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన తెలిపారు. నామినేషన్ల ఉప సంహరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం పోటీలో అనూహ్యంగా 17 మంది నిలిచారన్నారు. దీనివల్ల 304 పోలింగ్ కేంద్రాల్లో రెండు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటుచేస్తున్నారు. జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకుడు కె.వివేకనందన్ స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. తహసీల్దార్లు సుధాకర్, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలో పడి బాలుడి మృతి



గెడ్డలో పడి మృతి చెందిన బాలుడు అశ్విన్

ముంచంగిపుట్టు: దుస్తులు ఉతకడానికి వెళ్తున్న తల్లితో తోడు వెళ్లిన ఓ కుమారుడు అరబీరు గెడ్డలో మునిగి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మాకవరం పంచాయతీ అరబీరు గ్రామానికి చెందిన జనం రామకృష్ణ, ఈశ్వరమ్మల కుమారుడు జనం అశ్విన్(7). బుధవారం మధ్యాహ్నం ఈశ్వరమ్మ దుస్తులు ఉతకడానికి గెడ్డకు వెళ్లింది. ఆమెకు తోడుగా అశ్విన్ కూడా వెళ్లాడు. ఆమె ఉతికే పనిలో ఉంటుండగా కుమారుడు ప్రమాదవశాత్తు గెడ్డలో మునిగిపోయాడు. గమనించిన తల్లి కేకలు వేయడంతో అరబీరు గ్రామస్తులు పరుగులు పెడుతూ గెడ్డ వద్దకు వచ్చి నీటిలో మునిగిపోయిన బాలుడిని బయటకు తీశారు. అప్పటికే అశ్విన్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు హుటాహుటిన లబ్బూరు పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అందించిన వైద్యులు బాలుడి పరిస్థితి విషమంగా ఉందని, ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తీసుకువెళ్లాలని సూచించారు. దీంతో బాలుడిని ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. స్థానిక వైద్యాధికారి సంతోష్.. బాలుడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు కుమారుడి మృతదేహంపై పడిపడి రోదించడం అందర్నీ కంట తడిపెట్టించింది. అనంతరం మృతదేహాన్ని అరబీరు తరలించడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

ఎటపాక: మండలంలోని గౌరిదేవిపేట పంచాయతీకి చెందిన 25 కుటుంబాలు బుధవారం మండల పార్టీ ఉపాధ్యక్షులు ఆకుల వెంకటరామారావు ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్సీ అనంతబాబు కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. పార్టీలో చేరిన వారిలో దారా రవి, మల్లేల లక్ష్మణరావు, కాటిబోయిన నాగయ్య, ఆలివేలు, రమణ, రత్తమ్మ తదితరులున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి అన్ని వేళలా అండగా ఉంటామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి, ఎంపీ అభ్యర్థి తనూజారాణి గెలుపునకు కృషి చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత,ఎంపీపీ కాక కామేశ్వరి,సొసైటీ చైర్మన్ పసుపులేటి లక్ష్మణరావు, పార్టీ మండల కన్వీనర్ తానికొండ వాసు, జిల్లా కార్యదర్శి దామెర్ల రేవతి, గొమ్ము కొత్తగూడెం సర్పంచ్ పండా కామేశ్వరరావు, నాయకులు నాగేశ్వరరావు, నాగయ్య, కృష్ణబాబు,నవీన్, దయాకర్, సూరిబాబు, సాయిబాబు, వెంకట్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించే వ్యక్తి హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రుద్రశేఖర్

డుంబ్రిగుడ/అరకులోయ టౌన్: తహసీల్దార్ కార్యాలయం సమీపంలో బుధవారం ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించే ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. సీఐ సీహెచ్ రుద్రశేఖర్, ఎస్ఐ సంతోస్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. సీఐ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించే వారిలో ఏర్పడిన ఘర్షణ కారణంగా ఎస్.కోట మండలం రాజీపేట గ్రామానికి చెందిన బత్తిన శివశ్రీనివాస్(40) హత్యకు గురైనట్టు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకు ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

గెడ్డలో పడి యువకుడి మృతి



సతీష్ (ఫైల్)

సీలేరు: చేతికి అందివచ్చిన కొడుకు కూలి పని చేసుకుంటూ ఎంతో కొంత డబ్బు సంపాదిస్తు తల్లిదండ్రులను పోషిస్తున్న తరుణంలో ప్రమాదవశాత్తు నదిలో పడి మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. సీలేరు గ్రామానికి చెందిన ధర్మాన సింహాచలం భార్య శాంతి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తన కొడుకు ధర్మాణ సతీష్ కుమార్(26) గ్రామంలో టెంట్ హౌస్‌లో కూలి పనిచేస్తూ తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటున్నాడు.ఈ క్రమంలో రెండు రోజుల కిందట సీలేరు నదిలో స్నానానికి వెళ్లి కాలుజారి గల్లంతు కాగా, బుధవారం సాయంత్రం గెడ్డలో శవమై తేలాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. సీలేరు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పజెప్పారు. ఐదేళ్ల కిందట శాంతి కుమార్తె అనారోగ్యంతో మృతి చెందగా, ఇప్పుడు కొడుకు మృతితో ఆ కుటుంబం దు:ఖ సాగరంలో మునిగింది. గ్రామంలో అందరితో సరదాగా ఉండే సతీష్ ఆకస్మిక మృతితో అందరూ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

18 కిలోల గంజాయి స్వాధీనం

ముంచంగిపుట్టు: దశిరిపుట్టులో బుధవారం నిర్వహించిన తనిఖీల్లో మల్కన్‌గిరి జిల్లా పనసపుట్టు నుంచి మండల కేంద్రం మీదుగా పాడువ గ్రామానికి వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీలు చేయగా ప్లాస్టిక్ సంచుల్లో గంజాయిని గుర్తించినట్టు ఎస్ఐ రవీంద్ర చెప్పారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, గంజాయిని, బొలెరో వాహనంను సీజ్ చేసి ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌కు తరలించారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి 18 కిలోలు ఉందని, దీని విలువ రూ.90 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులు కోరాపుట్టుకు చెందిన షేక్ రంజాన్, జయపురం గ్రామానికి చెందిన ప్రకాష్ ఖోస్లాగా గుర్తించారు. ఆర్ఐ భూపతిరావుపడాల్, ఏఎస్ఐ తిరుపతిరావు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు

కూనవరం: పేదల అభ్యున్నతే లక్ష్యంగా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ అన్నారు. మండలంలోని టేకుబాక, చినార్కూరు గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. మండలంలో జగనన్న ప్రభుత్వం ఈ ఐదేళ్లలో రూ. 130 కోట్లు మేర నగదు లబ్ధిదారుల ఖాతాలో జమ చేసిందన్నారు. మండలంలో 3901 మందికి పింఛన్ నగదు రూ.53 కోట్లు జమ అయిందన్నారు.జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలంటే ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి, అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, మండల జేసీయస్ ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, మేరుకులం, ఆరెకటిక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు దీకొండ గంగాధర్‌రావు, వెంకట రామారావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పూర్ణానందం, సొసైటీ అధ్యక్షుడు కొండలరావు, సర్పంచ్‌లు, ఎంపీటీలు, ప్రసాద్, ధర్ముల పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

అరకు నియోజకవర్గం పర్యాటకంగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. శీతాకాలంలో మనసును దోచే మంచు అందాలను తిలకించేందుకు దేశ విదేశాల నుంచి పర్యాటకులు భారీగా వస్తుంటారు. వేసవిలో కూడా వీరి తాకిడి ఎక్కువగా ఉంటుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలకు జీవనాధారమైన పర్యాటక రంగంతోపాటు మిగతా అన్ని రంగాలను రాష్ట్రప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఇవన్నీ అరకు అసెంబ్లీకి బరిలో ఉన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం విజయానికి దోహదపడనున్నాయి.

అరకులోయ ముఖచిత్రం





బొర్రా గుహలు వద్ద జిప్‌లైన్

- దేశ విదేశీ పర్యాటకుల రాకతో మారిన ముఖచిత్రం
- ప్రత్యక్షం, పరోక్షంగా వేలాది కుటుంబాలకు జీవనాధారం
- తూర్పు కనుమల్లో అద్భుత ప్రాంతంగా గుర్తింపు
- ఆంధ్రా ఊటీగా ప్రాచుర్యం
- 238 గ్రామాల పరిధి, 24 వేల ఎకరాల విస్తీర్ణంలో జోలాపుట్టు జలాశయం
- చరిత్రకు సాక్ష్యం మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం
- ప్రపంచవ్యాప్తంగా బొర్రా గుహలకు గుర్తింపు

గిరిసీమకు మణిహారం



అంజోడా ఫారంలో అరకు పినారీ

అనంతగిరి (అరకు): పూర్వం జైపూర్ మహారాజుల పాలనలోని ఏజెన్సీ ప్రాంతం ఉండేది. రాజరికం పోయిన తరువాత.. గిరిజనుల భూముల రక్షణ కోసం బ్రిటీష్ పాలనలో భూబదలాయింపు చట్టం అమల్లోకి వచ్చింది. స్వాతంత్ర్యం అనంతరం 1959లోని భూ క్రమబద్ధీకరణ నిబంధనలు ప్రభుత్వం రూపొందించింది. తరువాత వీటిని 1970లో సవరణ చేసి ఐదవ షెడ్యూల్‌ను అమల్లోకి తీసుకువచ్చింది. తద్వారా గిరిజనులకు ప్రత్యేక హక్కులు కల్పించేలా చట్టాలు రూపొందించింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో అరకు నియోజకవర్గం ఉండేది.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలను పునర్విభజించింది. గిరిజన ప్రాంతాన్ని పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను ఏర్పాటుచేసి అరకు నియోజకవర్గాన్ని దీనిలో చేర్చింది.

నియోజకవర్గ స్వరూపం

లోయలోని ఎత్తయిన కొండల మధ్యలోని ప్రకృతి అందాలు కలిగి ఉండడంతో అరకులోయ అని పేరు వచ్చింది. తూర్పుకనుమల్లోని అద్భుతమైన ప్రదేశంగా గుర్తింపు పొందింది. వివిధ కొండ జాతులకు చెందిన గిరిజనుల ఆయా ప్రాంతాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఆంధ్ర ఊటీగా అరకులోయ గుర్తింపు పొందిన తరువాత స్థితిగతుల్లో మార్పువచ్చింది. గిరిజనులు ఆర్థికంగా ఎదిగేందుకు ఓ అవకాశం కలిగింది.

- తూర్పు కనుమల్లో అరకులోయ ఉంది. ఒడిశా రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఈ నియోజకవర్గం పాడేరుకు 45 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 114 కిలోమీటర్ల దూరంలో ఉంది.
- అరకు–విశాఖ ప్రధాన రహదారిలో బీసుపురం సుంకరమెట్ట మధ్యలో ఉన్న గాలికొండలో బాక్సైట్ నిక్షేపాలు ఉన్నాయి. ఈ ప్రాంతం సముద్ర మట్టానికి 3,800 అడుగుల ఎత్తులో ఉంది.

వైఎస్సార్‌సీపీ వైపే..

అరకు నియోజకవర్గంలో ప్రధానంగా కొండదొర, భగత, వాల్మీకి, కొటియ, పరింగకుర్జా, కోదు తెగలతోపాటు ఇతర కులాల ఉన్నాయి. వీరిలో అధికశాతం ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారు.

రాజకీయ పోరు

నియోజకవర్గాల పునర్విభజనకు ముందు ఎస్.కోట నియోజకవర్గంలో అరకు, అనంతగిరి, మండలాలు ఉండేవి. విభజనకు ముందు పాడేరు నియోజకవర్గంలో ఉన్న హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ మండలాలను, అరకు, అనంతగిరితో కలిపి అరకులోయ నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. ఇలా ఏర్పడిన తరువాత 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వంజంగి కాంతమ్మపై టీడీపీ అభ్యర్థి సీవేరి సోమ గెలుపొందారు.

- 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సీవేరి సోమకు 29,647 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీ తరఫున పోటీచేసిన కిడారి సర్వేశ్వరరావు 63,700 ఓట్లు సాధించి గెలుపొందారు. తరువాత ఆయన టీడీపీలో చేరారు. 2018 సెప్టెంబర్‌లోని 23న డుంబ్రిగుడ మండలం లివిటిపుట్టు గిరి గ్రామదర్శిని కార్యక్రమానికి వెళుతున్న కిడారి సర్వేశ్వరరావు, సీవేరి సోమ మావోయిస్టుల చేతిలో హత్యకు గురయ్యారు.
- 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్‌పై 33,172 ఓట్ల మెజారిటీతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెట్టి పాల్గుణ విజయం సాధించారు.
- ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన పార్టీల నుంచి రేగం మత్స్యలింగం (వైఎస్సార్‌సీపీ), పాంగి రాజారావు (బీజేపీ) పోటీ చేస్తున్నారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మత్స్యలింగం దూసుకుపోతున్నారు. ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ మద్దతు కోరుతున్నారు. ఆయనకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి.



రేగం మత్స్యలింగం (వైఎస్సార్‌సీపీ)



పాంగి రాజారావు (బీజేపీ)

నియోజకవర్గ ప్రత్యేకతలు

- ఏటా శీతాకాలంలో మంచు అందాలను తిలకించేందుకు ఆంధ్రా ఊటీగా గుర్తింపు పొందిన అరకులోయ పరిసర ప్రాంతాలకు పర్యాటకులు వస్తుంటారు.
- బొర్రా పంచాయతీలో సహజసిద్ధంగా ఏర్పడిన బొర్రా గుహలు విశ్వవ్యాప్తంగా గుర్తింపు ఉంది. గోస్తనీ నదిని ఆనుకొని ఇవి ఏర్పడ్డాయి. బ్రిటీష్ భౌగోళికశాస్త్రవేత్త విలియం కింగ్ 1807లో వీటిని కనుగొన్నారు. 30 వేల నుంచి 50వేల సంవత్సరాల నాటి రాతి పరికరాలు లభించాయి.
- గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలో గిరిజన మ్యూజియాన్ని 1996లో ఏర్పాటుచేశారు. సుమారు 17 తెగలకు సంబంధించి, గిరిజన సంస్కృతిక ఆచారా సంప్రదాయాలు, పండగలు, శుభకార్యాలను ప్రతిబింబించేలా నమూనాలను ఏర్పాటుచేశారు.
- రాష్ట్రవ్యాప్తంగా ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందిన మత్స్యగుండం పుణ్యక్షేత్రంలో భక్తులు చేపలను మత్స్యదేవతులుగా పూజిస్తారు.
- ముంచంగిపుట్టు మండలంలో డుడుమ, పెదబయలు మండలంలో తారాబు జలపాతాలు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి.

మొత్తం ఓటర్లు	2,45,489
పురుషులు	1,19,429
స్త్రీలు	1,26,053
ఇతరులు	7

- అల్లూరి సీతారామరాజు జిల్లాలో జల విద్యుత్ కేంద్రాలకు నీరందించడంలో కీలకమైన జోలాపుట్టు జలాశయం ఇక్కడ ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లో సుమారు 238 గ్రామాల పరిధిలో 24 వేల ఎకరాల విస్తీర్ణంలో ఉంది. 2750 అడుగుల గల సామర్థ్యం గల దీనిని 1955లో నిర్మించారు. డుడుమ, బలిమెల జలాశయాలకు ఈ నీరు ప్రధాన ఆధారం.
- జోలాపుట్టు నుంచి నీటి విడుదల ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పువ్వు మాదిరిగా విరజిమ్ముతూ బయటకు రావడం దీని ప్రత్యేకత
- ఆంధ్రా ఒడిశా ఉమ్మడి నిర్వహణలో మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం ముంచంగిపుట్టు మండలంలో ఉంది. ఇక్కడ ఆరు యూనిట్ల ద్వారా 120 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. పూర్తి విదేశీ పరిజ్ఞానంతో నిర్మితమైంది.



ఆకర్షణీయంగా జోలాపుట్టు నుంచి నీటి విడుదల



మాచ్‌ఖండ్ జలవిద్యుత్ ప్రాజెక్ట్

- బేరమెంతో చెబితే రాయబేరం పెట్టేస్తా..
- ఇక చూస్కోండి.. వార్ వన్‌సైడైపోద్ది
- మా ఓట్లన్నీ మీ ఖాతాలోకే..

నేను 'జాతి'రత్నం.. నా మాటే శాసనం

అప్పుడే ప్రచారం ముగించుకొని కాస్త సేద తీరుదామని పార్టీ ఆఫీస్‌కి వచ్చారో ఎంపీ అభ్యర్థి.

ఇంతలో ముఖ్య అనుచరుడు వచ్చి.. అన్నా నిన్ను కలవడానికి బేరాలబాబు వచ్చాడు. గెలవడానికి ఏదో ముఖ్య విషయం చెబుతాడంట.. అనగానే ఆ అభ్యర్థి కళ్లల్లో గెలుపు సీన్ మెరిసింది. వెంటనే రమ్మను అని చెప్పి ఉన్న అలసటనంతా పక్కన పెట్టేసి.. బేరాలబాబు కోసం వెయిట్ చేస్తున్నాడు.

ఇంతలో లోపలికి వచ్చిన పెద్ద మనిషి.. సారూ నమస్తే నేనే బిల్డప్ బాబు. వీడు నా మనిషి సుబ్బుగాడు. మిమ్మల్ని చాలా సార్లు కలిసిన సారూ.. నా గురించి తెలియకపోతే లాస్ట్ ఎలక్షన్లో నిలబడిన ఎంపీని అడగండి. చెబుతారు. ఏరా సుబ్బిగా.. మన గురించి చెప్పారా అనగానే.. అంతేగా.. అంతేగా అన్నాడు సుబ్బుగాడు.

రావయ్యా బాబూ.. నీ కోసమే చూస్తున్నాను. ఏం తీసుకుంటావ్ టీ.. కాఫీ..

(మధ్యలోనే జోక్యం చేసుకొన్న బాబు)

ఈ ఎండలో టీ ఏంటి సార్.. మంచి కూల్ డ్రింక్ తీసుకురమ్మనండి అనగానే..

రేయ్.. బిల్డప్ బాబుకి కూల్ డ్రింక్ తీసుకురండి అని హుకుం జారీ చేశాడు.

నాకు కూలింగ్ మజ్జిగ ఇవ్వండి సారూ అని సుబ్బు అనగానే.. నువ్వుండరా సుబ్బిగా.. పెద్ద మనిషితో మాట్లాడుతున్నాగా అంటూ బిల్డప్‌బాబు చిన్నగా కసురుకున్నాడు.

అవన్నీ పక్కన పెట్టి చెప్పండి బాబూ.. ఏంటి సంగతి అని ఆదుర్దాగా అడిగాడు అభ్యర్థి.

ఆ.. ఏముంది సార్.. నేను మా కుల సంఘ ప్రెసిడెంట్‌ని. సిటీలో నేను ఫేమస్. మీకు తెలిసే ఉంటుందిగా.! ఇంతలో సుబ్బుగాడు **అంతేగా.. అంతేగా** అంటే తలుపాడు.

ఎన్నడూ ఆ ఫేస్ కూడా చూడని ఆ అభ్యర్థి.. అయోమయంలో పడినా.. దాన్ని కనిపించకుండా ఆ.. నువ్వెందుకు తెలీదు బిల్డప్ బాబూ.. నగరంలో ఎక్కడ ఉద్యమం జరిగినా.. నీ ఫొటోనే పేపర్లో కనిపిస్తుందిగా అన్నాడు.

ఆ.. అదే కదా నా గురించి తెలుసుకోకుండా మీరు ఉండలేరు. సరే పాయింట్‌కి వస్తున్నా.. నా సంఘంలో ఓ 20 వేల మంది ఉన్నారు. ఇందులో నా వర్గం 15 వేలు. వాళ్లకు నేను ఎంత చెబితే అంత. ఆ విషయం చెబుతామనే ఇలా వచ్చినా అని గంభీరంగా చెబుతూ.. నిజమే కదరా అనగానే.. వెంటనే **అంతేగా.. అంతేగా** అని సుబ్బు తలాడించాడు.

ఆ మాటలు విన్న ఎంపీ అభ్యర్థికి కౌంటింగ్ దృశ్యాలు కళ్లముందు కదలాడాయి. ఆ వార్డుకి సంబంధించిన రౌండ్ వచ్చే సరికి.. 15 వేల ఓట్ల ఆధిక్యం పెరిగినట్లు ఊహించుకున్నాడు.

సార్.. సార్... అని బిల్డప్ బాబు.. పిలువుతో ఈ లోకంలోకి వచ్చాడు.

ఏంటి సార్.. అప్పుడే ఎంపీ కళ ఉట్టిపడుతోందని బిల్డప్ బాబు అనగానే.. ముసిముసి నవ్వులు నవ్వుతూ ఏముందీ.. అంతా నీలాంటి వాళ్ల ఆశీర్వాదం లేవోయ్ అంటూ మురిసిపోయాడు.

ఏంటి సారూ.. కేవలం ఆశీర్వాదం అని సరిపెట్టేస్తారా ఏంటి? ఆ ఓట్లన్నీ మీకే పడాలి కదా.

అదేంటి బాబూ అలా అంటావ్.. మీలాంటి వాళ్లు పక్కన ఉంటే కదా.. గెలుపు తలుపు తడుతుంది.

అందుకే సార్ నేను ఎవరి దగ్గరికీ వెళ్లకుండా మీ దగ్గరికి వచ్చాను. మీరన్నా.. మీ పార్టీ అన్నా నాకు అభిమానం.

సరే బిల్డప్‌బాబూ.. ఏం చేయాలో చెప్పు అని ఆశగా అభ్యర్థి అడిగాడు.

ఒక్కో ఓటు లెక్కన ఇవ్వారనుకోండి.. నా సంఘం వరకు నేను పంచేస్తాను. దాని బట్టి 15 వేల మందికి ఎంతిస్తారో ఓ మాటనుకుందాం.

గాల్లో లెక్కలు వేసుకోవడం ప్రారంభించాడా అభ్యర్థి. ఓటుకు రూ.1000 అనుకుంటే 15 వేల ఓట్లు.. వామ్మో కోటిన్నరా అని గట్టిగా అరిచాడు.

అదేంటి సార్.. కోటిన్నరకే ఇలా అయిపోతారా.? ఇంకా ఏలోకంలో ఉన్నారు మీరు.. ఓటుకు వెయ్యి రూపాయిలు.. ఇది 2014 మాట.. ఇంకా మీరు అప్‌డేట్ అవ్వకపోతే ఎలా.?

ఇప్పుడు 2000.. అంటే మొత్తం ఓట్లకి రూ.3 కోట్లు.. **అంతేగా.. అంతేగా** అని సుబ్బు నవ్వుతూ చెప్పాడు..

అయ్యా.. బిల్డప్ బాబూ నా మీద అభిమానం ఉంటే.. నీ మాట కాదు.... నా మాటా కాదు.. ఓ కోటి రూపాయలకి ఓకే చేసుకో. గెలిస్తే.. తప్పకుండా నీకు ఏదో రకంగా సాయం చేస్తాను అని అభ్యర్థి బతిమాలాడు.

ఏంటి సార్ మీరు.. మరీ ఇబ్బంది పెడుతున్నారు. మా వర్గాన్ని అడిగి ఏ విషయమో కన్ఫర్మ్ చేస్తాను. అయినా విజయం వరించే ఓట్లు ఇల్లు వెతుక్కుంటూ వస్తే బేరాలాడుతున్నారు. ఒకసారి మీ అపోజిషన్ వాళ్లతో మాట్లాడతాను.. వారి వెర్షన్ బట్టి మీకు సపోర్ట్ ఇవ్వాలా.. వద్దా డిసైడ్ చేస్తాను అని లేవబోయాడు.

వెంటనే బిల్డప్‌బాబు చేయి పట్టుకుని ఎందుకయ్యా.. విసుక్కుంటావ్. ఫైనల్‌గా ఎంతో నువ్వే చెప్పు అని అభ్యర్థి అనగానే.. మన పార్టీ కాబట్టి 15వేల ఓట్లకు పాత పద్ధతిలోనే కోటిన్నర, నాకు ఓ పది లక్షలు కలిపి మొత్తం కోటీ 60కి ఖాయం చేసుకోండి చాలు.. మీరు ఇంట్లో ఏసీ వేసుకుని పడుకున్నా.. గెలుపు ఖాయం. ఇక చూస్కోండి.. వార్ వన్‌సైడే అని బొమ్మ చూపించేశాడు.

కాస్త.. నసుగుతూ నీకే కోటిన్నర అంటే.. మిగిలిన వాళ్ల సంగతి ఎలాగో అర్థం కావడం లేదు. సరేలే బాబు ఏదో ఒకటి చేస్తాను. నువ్వు మాత్రం మరెవ్వరి దగ్గరకూ వెళ్లడానికి వీల్లేదని మాట తీసుకున్నాడు అభ్యర్థి.

సర్లెండి సార్ మీకు మాటిస్తున్నాను.. ఇంకెవ్వరినీ కలవను. అడ్వాన్స్ ఎంతో కొంత ఇస్తే బయల్దేరతానని అనగానే ఓ పాతిక లక్షలు చేతిలో పడ్డాయి. వాటిని తీసుకొని బై బై చెప్పాడు బిల్డప్ బాబు.. కారులో కూర్చొని ఏరా సుబ్బిగా.. పక్క పార్టీ కేండేట్ దగ్గరికి వెళ్దాం.. కారు తియ్ అనగానే.. అంతేగా.. అంతేగా అంటూ బయలుదేరి వెళ్లిపోయారు.

(ఇదీ ప్రస్తుత ఎన్నికల హడావిడిలో ప్రతి పార్టీ కార్యాలయంలో జరుగుతున్న తంతు. ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు సర్కస్ ఫీట్లు చేస్తుంటే.. తాము తలచుకుంటే.. గెలుపోటములు తారుమారు చేస్తామంటూ పార్టీ నేతల వద్ద కొందరు హడావిడి చేస్తున్నారు. మాది ఫలానా సామాజిక వర్గానికి చెందిన సంఘం. మా దగ్గర వందలు, వేల మంది ఓటర్లున్నారంటూ మాటల్లోకి దిగుతున్నారు. తమ కాలనీలు, బస్తీల్లో కాస్తో కూస్తో పలుకుబడి ఉన్న చోటా మోటా నేతలంతా చిన్నపాటి సమావేశాలు ఏర్పాటు చేసి.. పెద్ద జాక్‌పాట్ కొట్టేందుకు వ్యూహరచనలు చేస్తున్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా.. ఎన్నికలు ఉండగానే నాలుగు రాళ్లు వెనకేసుకోవాలన్నది వీరి లక్ష్యం. ప్రతి పార్టీ గట్టు ఎక్కుతూ.. స్వకార్యం చక్కబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎలాగైనా బేరం కుదిరితే చాలనే ఉద్దేశంతో కాళ్లకు చక్రాలు కట్టుకుని మరీ తిరుగుతున్నారు.) – సాక్షి, విశాఖపట్నం

ముచ్చట

ఔను.. వాళ్లిద్దరూ ఇష్ట పడ్డారు!

'ఏరా అప్పిగా కనపడ్డం మానేశావ్..ఎక్కడికి ఎల్లిపోనావ్‌రా..'పెందుర్తిలో చాన్నాళ్ల తర్వాత తారసపడ్డ అప్పారావుని ఆప్యాయంగా పలకరించాడు కన్నారావు.

'ఏం లేదురా కన్నిగా ఒంట్లో నలతగా ఉంటే డాట్టరు దగ్గరకెళ్లాను..ఎండలన్నాళ్లు బయట ఎక్కువ తిరగొద్దన్నాడు' అని తన బాధను చెప్పుకున్నాడు కన్నిగోడు.

'హా జాగర్తరా బాబు..ఈ ఎలచ్చన్లు అవీ ఇవీ అని అటూ ఇటూ తిరక్కు' అంటూ జాగ్రత్త చెప్పాడు అప్పిగోడు.

'అలాగే నేరా..ఇంకేటిరా అప్పిగా కబుర్లు.. ఎలచ్చన్లు ఎలా ఉన్నాయిరా..పెందుర్తిలో ఈపాలి ఎవడొత్తాడంటావ్' అని ఆరా తీశాడు కన్నిగోడు.

'ఏం ఎలచ్చన్లు రా..ఈ కుర్రోడేమో జనమందరితో తిరుగుతుండు..ఆ గాజు గుర్తోడు ఆడి కులపోళ్లతో తిరుగుతన్నాడు' అంటూ దీర్ఘం తీశాడు అప్పిగోడు.

'అవున్రా అప్పిగా..ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ కులాన్ని బలే రెచ్చగొడుతున్నాడ్రా..ఏ మాట కా మాట గానీ..మనోడు చొక్కాలు మార్చినంత వీజీగా జెండాలు మార్చేత్తాడ్రా' అన్నాడు కన్నిగోడు.

'ఎన్ని మార్చినా..ఎంత మంది కులపోళ్లను తిప్పుకున్నా..ఈ సారీ కుర్రోడే వచ్చేత్తాడ్రా' అన్నాడు అప్పి గోడు.

'ఇంతకీ సైకిల్ గుర్తోడి పరిస్థితి ఏటో' అని ఆరా తీశాడు కన్నిగోడు..

'ఇంకేం సైకిల్‌ర్లా..అది పెందుర్తి నుంచి మాడుగుల పోయింది..ఎన్నుపోటోడు కొట్టిన దెబ్బకి అక్కడికి పోయి ముక్కి మూలుగుతున్నాడ్రా..అని ఎద్దేవా చేశాడు అప్పిగోడు.

'ఇంతకీ సైకిలోడు..గలాసోడు కలిసారా' అని ఆరా తీశాడు కన్నిగోడు.

'మొన్నటి దాకా గ్లాసు పగలగొడతానన్న సైకిలోడు పక్కూరులో సీటు ఇవ్వగానే తోక ముడిచి గలాసోడికి చిత్తం దొరా' అని దాసోహం అయిపోయాడ్రా..అన్నాడు అప్పిగోడు

'ఇదెట్రా ఇది అంతన్నడు ఇంతన్నాడు ఆ సైకిలోడు..ఇప్పుడిదెట్రా' అని నివ్వెర పోయాడు కన్నిగోడు.

'అవున్రా బాబు..వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు..ఈ కుర్రోడిని కష్టపెట్టడానికి చూత్తాన్రా' అంటూ ఒకింత కోపాన్ని ప్రదర్శించాడు అప్పిగోడు.

'ఆడు ఈడు కలవడం ఏట్రా..సైకిలోడేమో గలాసోడిని ముఠాకోరు..దొంగోడు అన్నాడు...గలాసోడెమో బాబు–చినబాబు కలిసి దోచేసి తెల్లకార్లో ఎత్తుకుపోతున్నారు అన్నాడు' అంటూ ఇటీవలే ఇద్దరి మధ్య జరిగిన ప్రేమ'పూర్వ'క సంభాషణను గుర్తు చేశాడు కన్నిగోడు.

'ఏమోరా..అతడ్ని ఇతడు ఛీకొట్టాడు..ఇతన్ని అతడు దగ్గరకే చేరనివ్వలేదు..ఒక రకంగా అంటరానోళ్ల లాగా చూసుకున్నారు..అలాంటిది మొన్న ఇషాకపట్నం 'చంద్రన్న' వచ్చి సైకిలోడికి 'కానుక' ఇచ్చేసరికి' ఇలా దిగజారిపోయాడ్రా..అంటూ నిజం చెప్పాడు అప్పిగోడు.



'వార్ని సైకిలోడు ఇంత చీప్ ఏట్రా..ఆడేదో పెద్ద పోటుగాడు అనుకున్నాం..చివరకు గలాసు గుర్తు గుంటలతో కూడా అమ్మనా బూతులు తిట్టించుకుని..మళ్లీ ఆడికే జై కొడతాడా' అంటూ ఆసహనం వ్యక్తం చేశాడు కన్నిగోడు.

'ఏమున్నాదిరా సీటు సిరిగిందన్నారు..అలాంటోడికి బాబోరు మళ్లీ బిస్కెట్ వేశాడు..ఇంకేం ఉందిరా తోకూపేశాడు' అన్నాడు అప్పిగోడు.

'ఏదోటి చేసుకోనిరా అప్పిగా..ఎటు చూసినా ఈ కుర్రోడి 'ఫ్యాన్' గాలి ముందు ఈలంతా ఎక్కడ నిలబడతార్రా అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు కన్నిగోడు. – పెందుర్తి